క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ


రాజగోపాల్, సీఐ

పర్వతగిరి : పర్వతగిరి సీఐగా బి.రాజగోపాల్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పని చేసిన సీఐ శ్రీనివాస్ బదిలీపై వెళ్లగా అతని స్థానంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల సీఐగా పని చేసిన రాజగోపాల్ బదిలీపై పర్వతగిరి వచ్చారు.

విధుల్లో చేరిన ఎస్సై సందీప్‌కుమార్



రాయపర్తి : రాయపర్తి ఎస్సైగా వడ్డె సందీప్‌కుమార్ సోమవారం విధుల్లో చేరారు. గతంలో పనిచేసిన విజయ్‌కుమార్ బదిలీపై వెళ్లగా సందీప్‌కుమార్ ఎస్సైగా విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. శాంతి భద్రతలను కాపాడేందుకు గ్రామాల్లోని ప్రజలు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్సైని మర్యాదపూర్వకంగా కలిశారు.

నియామకం


గనిపాక ప్రదీప్

గీసుకొండ : గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ మొగిలిచర్లకు చెందిన గనిపాక ప్రదీప్ మాదిగ హక్కుల దండోరా(ఎంహెచ్‌డీ) జిల్లా అధ్యక్షుడిగా నియామకం అయ్యారు. ఈ మేరకు సోమవారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొంగరి శంకర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ప్రదీప్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన ఎంహెచ్‌డీ రాష్ట్ర కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు. మాదిగల హక్కుల కోసం పోరాడుతానని పేర్కొన్నారు.

ఎంపీడీఓకు సన్మానం


విజయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న ఉద్యోగులు

నల్లబెల్లి : బదిలీపై వెళ్తున్న నల్లబెల్లి ఎంపీడీఓ విజయ్‌కుమార్‌ను మండల పరిషత్ కార్యాలయ ఉద్యోగులు సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మండల పంచాయతీ అధికారి కూచన ప్రకాశ్ మాట్లాడుతూ.. విజయ్‌కుమార్ సేవలను కొనియాడారు. సీనియర్ అసిస్టెంట్ అంజయ్య, పంచాయతీ క్యాదర్శులు సుధాకర్, పద్మనాభస్వామి, ధర్మేందర్, శాంత, రాజు, వేణుమాధవ్, టైపిస్టు గంగాధర్ పాల్గొన్నారు.

బియ్యం అందజేత


ఆర్థికసాయం అందజేస్తున్న కానిస్టేబుల్ రాజు

ఖానాపురం : మండలంలోని నాజీతండాకు చెందిన భద్రు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా బాధిత కుటుంబాన్ని పోలీస్ కానిస్టేబుల్, బ్లడ్ మోటివేటర్ కన్నె రాజు ఆధ్వర్యంలో సోమవారం పరామర్శించారు. రాజు సోషల్ మీడియా ద్వారా సేకరించిన రూ.20వేలతో పాటు 50కిలోల బియ్యాన్ని బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో నగేష్, బాలు, ఫరీద్‌పాషా, అన్వర్‌పాషా, రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నర్సరీ పనుల పరిశీలన


నర్సరీని పరిశీలిస్తున్న శ్రీధర్‌రాజు

చెన్నారావుపేట : నర్సరీల్లో మొక్కల పెంపకాన్ని వేగవంతం చేయాలని ఎంపీఓ శ్రీధర్ రాజు అన్నారు. ఈ మేరకు మండలంలోని తిమ్మరాయినిపహాడ్ గ్రామంలోని నర్సరీ పనులను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎండాకాలంలో మొక్కలకు నీరు పట్టడంలో నిర్లక్ష్యంగా ఉండకూడదన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మమత, కారోబార్ పాషా, ఫీల్డ్ ఆఫీసర్ శ్రీదేవి తదితరులు ఉన్నారు.

'సమ్మేళనానికి తరలిరావాలి'

ఆత్మకూరు : ఈనెల 16వ తేదీన పరకాలలో జరిగే దళితుల ఆత్మీయ సమ్మేళనానికి దళితులు తరలిరావాలని దళిత హక్కుల పోరాట సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు బొచ్చు దిలీప్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో సోమవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం తొమ్మిదేళ్లలో దళితులకు కేటాయించిన బడ్జెట్ నిధులను పక్కదారి పట్టించారని ఆరోపించారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అందాల్సిన నిధులు రాకుండా బీఆర్‌ఎస్ ప్రభుత్వం అన్యాయం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే దళితులకు న్యాయం జరిగిందని, నేటి కాంగ్రెస్ ప్రభుత్వం దళితులకు కేటాయించిన బడ్జెటే దీనికి ఉదాహరణ అని అన్నారు.

పాలమూరు ప్రాజెక్టుపై వివక్ష


వర్ధన్నపేట: మాజీ సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు


సంగెంలో..

- కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు బొంపెల్లి దేవేందర్‌రావు

వర్ధన్నపేట : పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో పాలమూరు ప్రాజెక్టుపై వివక్ష చూపి ఇప్పుడు ఆ అంశంపై మాజీ సీఎం కేసీఆర్ మాట్లాడడం విడ్డూరంగా ఉందని కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు బొంపెల్లి దేవేందర్‌రావు ఎద్దేవా చేశారు. మాజీ సీఎం కేసీఆర్ నల్లగొండలో కృష్ణ జలాలపై నిర్వహించ తలపెట్టిన బహిరంగ సభను నిరసిస్తూ రాష్ట్ర కిసాన్ సెల్ పిలుపులో భాగంగా సోమవారం వర్ధన్నపేట పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్ వద్ద వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. అనంతరం మాజీ సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మకు చేపల పులుసు తినిపించి నిరసన తెలుపుతూ దహనం చేశారు. ఈ సందర్భంగా దేవేందర్‌రావు మాట్లాడారు. కేసీఆర్ తీరు దొంగే దొంగ అన్నట్లుగా ఉందన్నారు. పాలమూరు, రంగారెడ్డి ప్రాజెక్టులపై వివక్ష చూపి ఇప్పుడు ఆయన మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ ప్రాజెక్టు వల్ల మహబూబ్‌నగర్ జిల్లా కాకుండా రంగారెడ్డి జిల్లాకు సైతం మూడు లక్షల ఎకరాలకు సాగునీరు, నల్లగొండకు 30 వేల ఎకరాలకు సాగునీరు ఇవ్వకుండా మాట నిలబెట్టుకోలేవు కాని కేసీఆర్ ఏ ముఖం పెట్టుకుని నల్లగొండకు వెళ్తున్నావో సమాధానం చెప్పాలన్నారు. కృష్ణా పరివాహక ప్రాంతం తెలంగాణ పరిధిలో 68శాతం, అదే ఆంధ్ర ప్రాంతంలో కేవలం 32 శాతం ఉందన్నారు. కృష్ణానదిలో తెలంగాణ వాటా 484 టీఎంసీలు వాటా హక్కు కలిగి ఉందన్నారు. కాగా 2015 మేలో కేసీఆర్ ఆనాటి నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు సీడబ్ల్యూసీ ఎదుట తెలంగాణ వాటా 299 టీఎంసీలు ఒప్పుకున్న మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. అదే విధంగా 2023–24 బడ్జెట్‌లో కేసీఆర్, ఆర్థికశాఖ మంత్రి హరీష్ రూ.200 కోట్ల కృష్ణ రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు(కేఆర్‌ఎంబీ)కి కేటాయిస్తూ మన దగ్గర ఉన్న కృష్ణ నది మీద ఉన్న ప్రాజెక్టులకు మెయింటెనెన్స్ హ్యాండ్ ఓవర్ చేసింది మీరు కాదా అని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రజలకు అన్యాయం జరగకుండా ఉండే విధంగా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ నిరసనలో నాయకులు రాజిరెడ్డి, కమ్మగొని ప్రభాకర్‌గౌడ్, ఎండీ చోటే, ఎద్దు సత్యనారాయణ, పోశాల వెంకన్న, ఎండీ అప్సర్, సమ్మెట సుధీర్, కొండేటి బాలకృష్ణ, ఎలికట్టె ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

మాజీ సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం

సంగెం : కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో మాజీ సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కృష్ణా జలాల వాటాలో తెలంగాణకు అన్యాయం చేసి బీఆర్‌ఎస్ ముఖ్య నాయకులతో పాటుగా అసెంబ్లీకి రాకుండా మాజీ సీఎం కేసీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చొల్లేటి మాధవరెడ్డి, కిసాన్ సెల్ అధ్యక్షుడు అచ్చ నాగరాజు, ఎంపీటీసీ గూడ సంపత్‌రెడ్డి, నాయకులు జనగాం రమేష్, మెట్టుపల్లి రమేష్, ఇండ్ల రవికుమార్, కేశవులు, ఎల్లయ్య, సదయ్య, చేరాలు, మల్లేశంతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళాలు


చెన్నారావుపేట: దాతలను సన్మానిస్తున్న సభ్యులు

చెన్నారావుపేట : మండలంలోని పాపయ్యపేట గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే కంఠమహేశ్వర స్వామి ఉత్సవాల్లో ఎల్లమ్మ తల్లి విగ్రహం ఏర్పాటునకు దాతలు బుడిగె మానస–సతీష్‌గౌడ్ తల్లిదండ్రులు లక్ష్మి, వెంకటయ్యగౌడ్‌లు ముందుకు వచ్చారు. రూ.70,000లు విరాళాలు అందించడా కాగా సోమవారం కులపెద్ద మేడి ప్రభాకర్‌గౌడ్, సంఘం అధ్యక్షుడు కత్తి స్వామిగౌడ్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం గౌడ సంఘం పెద్దలను విగ్రహ దాతలను సన్మానించారు. కార్యక్రమంలో చిట్టి సంఘం అధ్యక్షుడు బుడిగె నరేందర్‌గౌడ్, మాజీ అధ్యక్షుడు బండి రమేష్ గౌడ్, వెంకటేశ్వర్ గౌడ్, తాళ్ల సమ్మయ్యగౌడ్, బత్తిని ఏకాంతంగౌడ్, బొల్లెపల్లి శివాజీగౌడ్ ఉన్నారు.


పర్వతగిరి: విరాళం అందజేస్తున్న దాతలు

దాతలకు అభినందనలు

పర్వతగిరి : మండలంలోని వడ్లకొండ గ్రామంలో రంగనాయకులస్వామి గుట్టప్రాంతంలో సీతారామాంజనేయస్వామి ఆలయ నిర్మాణం చేపట్టారు. అదే గ్రామానికి చెందిన కోదాటి హేమలత సుధాకర్ దంపతులు సోమవారం రూ.20,116 విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు దాతలను అభినందించారు.

రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ మానక్ అవార్డుకు ఎంపిక


అవనితకు ప్రశంసపత్రం అందజేస్తున్న డీఈఓ

నల్లబెల్లి : జనవరి చివరి వారంలో జరిగిన రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ మానక్ అవార్డుకు మండలంలోని కాకతీయ బ్రిలియంట్ స్టార్స్ హైస్కూల్ పదోతరగతి విద్యార్థి అవనిత ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ కమలాకర్ రావు సోమవారం తెలిపారు. జిల్లా స్థాయి ప్రదర్శనలో బైక్‌విత్ సూపర్ ప్రొటెక్షన్ అనే ప్రాజెక్టును రూపొందించి ఉత్తమ ప్రతిభను ప్రదర్శించి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన అవనితను డీఈఓ వాసంతి, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్, డైరెక్టర్స్ రామారావు, రాజిరెడ్డి, హెచ్‌ఎం రణధీర్ రెడ్డి, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.

ఇంటింటా ప్రచారం

నర్సంపేట రూరల్ : త్రైత సిద్ధాంత ఆదికర్త ఆచార్య ప్రబోధానం యోగీశ్వర స్వామి రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ గ్రంథాలను మాఘ మాసం ప్రత్యేకతని పురస్కరించుకొని నర్సంపేట మండలంలోని బానోజీపేట, దాసరిపల్లి గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక మహబూబాబాద్ కమిటీ అధ్యక్షురాలు కృష్ణవేణి మాట్లాడారు. మాఘమాసం శుక్ల చతుర్ధశి శివరాత్రిగా నిర్ణయించారని, పూర్వం నిరాకర పరమాత్మకు ఈశ్వర లింగంగా చూపించారన్నారు. అలాగే మాఘపూర్ణిమ భగవంతుని జన్మను తెలియజేస్తోందన్నారు.


ప్రచారం నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు

ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు రజిత, వీరస్వామి, లలిత, సుమలత, సుష్మ, హేమలత, పాపక్క, నవ్యశ్రీ, రేఖ,స్వరూప, వీరలక్ష్మి, సారయ్య, హిందుశ్రీ, ధనలక్ష్మి, చిన్నయి దొర, హర్షవర్ధన్, ఆర్యవర్ధన్, ధన్విశా రవి,కావ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన


నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయినులు

రాయపర్తి : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జేఏసీ ఇచ్చిన పిలుపులో భాగంగా మండలకేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో ఉపాధ్యాయినులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నల్లబ్యాడ్జీలను ధరించి తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నినాదాలు చేశారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి

గీసుకొండ : గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ మొగిలిచర్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 40 మంది పదో తరగతి విద్యార్థులకు సోమవారం పరీక్ష ప్యాడ్, పెన్నులు, పెన్సిళ్లను నేతాజీ సర్వీస్ ప్రతినిధులు అందజేశారు. బొట్టు వినయ్, సర్వీస్ టీం కార్యదర్శి బరుపటి అనిల్‌కుమార్, హెచ్‌ఎం పోలెపాక అనిత, రమేశ్, పీఈటీ బీమగాని ముఖర్జీ, మండ సాయి, వెంకటేశ్, హరీష్, నాగరాజు, రాజేశ్ పాల్గొన్నారు.

పండ్లు పంపిణీ

గీసుకొండ మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఇటుక బట్టీల్లో పని చేసే కార్మికులకు సోమవారం నేతాజీ సర్వీస్ టీం సభ్యులు పండ్లు పంపిణీ చేశారు. రడం భరత్ పుట్టినరోజు సందర్భంగా పండ్లను పంపిణీ చేయగా యువనాయకులు తదితరులు పాల్గొన్నారు. అలాగే వరంగల్ బస్టాండ్, రైల్వే స్టేషన్ వద్ద యాచకులు, ప్రయాణికులకు అన్నదానం చేసినట్లు సర్వీస్ టీం సభ్యులు తెలిపారు.


పరీక్ష సామగ్రితో విద్యార్థులు

కల్యాణానికి గోటితో ఒలిచిన తలంబ్రాలు

ఆత్మకూరు : సీతారాముల కల్యాణానికి గోటితో ఒలిచిన తలంబ్రాలు ఉపయోగించనున్నట్లు అఖిల భారత హనుమాన్ ప్రచారకుడు రాములుస్వామి తెలిపారు. సోమవారం రాములోరి తలంబ్రాల కోసం ధాన్యం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని జిల్లాల భక్తుల నుంచి తలంబ్రాలు స్వీకరిస్తామన్నారు.

కరాటేలో కేజీబీవీ విద్యార్థుల ప్రతిభ


పర్వతగిరి: విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు



నల్లబెల్లి: విద్యార్థినులతో పాఠశాల యాజమాన్యం

పర్వతగిరి : నర్సంపేటలోని పద్మశాలీ గార్డెన్‌లో ఆదివారం షోటోకాన్ జపాన్ కరాటే–డూ ఇండియా హంబూ ఆధ్వర్యంలో క్యోషి రచ్చ శ్రీను బాబు జాతీయ స్థాయి కరాటే పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా పర్వతగిరి మండలానికి చెందిన కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ విద్యార్థులు 37మంది పాల్గొన్నారు. వీరిలో 13మంది గోల్డ్ మెడల్స్, పది సిల్వర్ మెడల్స్, 14 బ్రాంజ్ మెడల్స్ సాధించారు. ఈ సందర్భంగా మెడల్స్ సాధించిన విద్యార్థులను సోమవారం జీసీడీఓ ఫ్లోరెన్స్, స్పెషల్ ఆఫీసర్ నాజియాసల్మా, కోచ్ పార్థసారథి, ఉపాధ్యాయులు అభినందించారు.

కరాటేలో బంగారు పతకాలు

పర్వతగిరి మండలంలోని ఏనుగల్ గ్రామానికి చెందిన కరాటే విద్యార్థులు ఆదివారం నర్సంపేటలో నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో బంగారు పతకాలు సాధించినట్లు మాస్టర్ కోలా పార్థు యాదవ్ తెలిపారు. ఈసందర్భంగా గ్రామంలో అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కాగా విజేత విద్యార్థులను ఎంపీటీసీ కోల మల్లయ్య, మాజీ సర్పంచ్ సంధ్యారాణినర్సింగం, మాజీ ఉప సర్పంచ్ గుండారపు సతీష్‌రావు, బీఆర్‌ఎస్ మండల యూత్ అధ్యక్షుడు గూడ నరేందర్, గ్రామ నాయకులు వారిని అభినందించారు.

కరాటేలో సత్తాచాటిన కేజీబీవీ విద్యార్థులు

నల్లబెల్లి : నర్సంపేట పట్టణంలోని పద్మశాలి గార్డెన్‌లో ఆదివారం నిర్వహించిన షోటోకాన్ జపాన్ కరాటే–డూ ఇండియా హంబూ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో నల్లబెల్లి కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం విద్యార్థులు ప్రతిభ చాటారు. 32 మంది బాలికలు బంగారు పతకం, 28 మంది విద్యార్థులు వెండి పతాకం 28 మంది విద్యార్థులు బ్రాంజ్ మెడల్ సాధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ సుజాత, కరాటే మాస్టర్ విజయ్ కుమార్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

భారత్ బంద్‌ను విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న ఇస్మాయిల్

సంగెం : ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆధ్వర్యంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 16న నిర్వహించ తలపెట్టిన భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని రైతు సంఘం జిల్లా నాయకుడు ఇస్మాయిల్ పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని కుంటపల్లిలో కార్మిక సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యాన్ని రక్షించాలన్నారు. మోదీ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను విస్మరించిందని, రైతులపై పెట్టిన కేసులను ఎత్తి వేయలేదని, నల్ల చట్టాలను రద్దు చేయలేదని విమర్శించారు. భారత్ బంద్‌లో అన్ని వర్గాల వారు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దుపాకి రాజు, గోనె రాంచందర్, శ్రీనివాస్, గుండేటి స్వామి, వెంకన్న, అశోక్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మార్కండేయ జయంతి


మార్కండేయ జయంతి వేడుకల్లో పద్మశాలీలు

సంగెం : పద్మశాలీల ఆరాధ్యదైవం భక్త మార్కండేయ జయంతిని మండలంలోని గవిచర్లలో ఘనంగా నిర్వహించారు. సోమవారం పద్మశాలి భవనంలో భక్త మార్కండేయ చిత్రపటానికి పూలమాలలు వేసి వేడుకలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు కొంతం యాదగిరి, అధ్యక్షుడు అనుమాస రమేష్, ఉపాధ్యక్షుడు కొంతం వేణుగోపాల్, నాయకులు చెన్నూరి యాకయ్య, అనుమాండ్ల జనార్దన్, సుదర్శన్, హరిప్రసాద్, ఉదయ్‌భాస్కర్, నరసింహస్వామితో పాటు తదితరులు పాల్గొన్నారు.

తైబందీ పంటను కాపాడండి

- అక్రమంగా నీటిని తోడడాన్ని ఆపివేయాలి
- తహసీల్దార్‌కు ఇల్లంద రైతుల ఫిర్యాదు


తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న రైతులు

వర్ధన్నపేట : ఊర చెరువు నుంచి తైబందీని కాదని కొందరు రైతులు పంపుసెట్‌లతో నీటిని అక్రమంగా తోడి వాడుకుంటున్నారు. దీంతో తైబందీలో సాగుచేసిన తమ పంట పొలాలు ఎండిపోయే పరిస్థితి నెలకొందని, నీటిని అక్రమంగా తోడకుండా వెంటనే ఆపివేయాలని సోమవారం ఇల్లంద గ్రామ రైతులు తహసీల్దార్ విజయసాగర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. ఇల్లంద గ్రామంలోని ఊర చెరువులో ఉన్న నీటి సామర్థ్యాన్ని బట్టి అధికారులు తైబందీ నిర్ణయించారు. దీంతో వారు ఎన్ని ఎకరాలకు అయితే అనుమతి ఇచ్చారో అన్ని ఎకరాలు వరినాట్లు వేసుకుని సాగు చేసుకుంటున్నారు. కొందరు రైతులు ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా చెరువులో పంపుసెట్లు ఏర్పాటు చేసి నీటిని అక్రమంగా తోడుకుంటున్నారని దీంతో తాము వేసిన పంట పొలాలు ఎండిపోయే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే అక్రమ నీటి తోడటాన్ని నిలిపి వేసి తమకు న్యాయం చేయాలని తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశామని తెలిపారు. కార్యక్రమంలో రైతులు సాయిలు, రాజు, కృష్ణమూర్తి, నాగెల్లి వీరన్న, సంపత్, కుమారస్వామి పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతి పోస్టర్ ఆవిష్కరణ


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

పర్వతగిరి : సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలను జయప్రదం చేయాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. ఈ మేరకు సేవాలాల్ జయంతి వేడుకల వాల్‌పోస్టర్‌ను నాగరాజు సోమవారం అసెంబ్లీ ప్రాంగణంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సేవాలాల్ జయంతి వేడుకలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్‌రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల దాహార్తి తీర్చేందుకు కృషి


బోరు పనులు ప్రారంభిస్తున్న నాయకులు

చెన్నారావుపేట : మండలంలోని తిమ్మరాయినిపహాడ్ పరిధిలో గల చంద్రతండాలో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు సోమవారం చేతి పంపు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు ఏటుకూరి జయరాజ్, జిల్లా కార్యదర్శి మొగిళి వెంకట్‌రెడ్డి మాట్లాడారు. సీడీఎఫ్ నిధులతో తండా ప్రజల దాహార్తిని తీర్చేందుకు కృషి చేస్తున్నామని, అందులో భాగంగానే చేతి పంపు వేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మండల యాకయ్యగౌడ్, పాపారావు, ఎన్.జోర్నెస్, ఎండీ నిజాం, హుజుర్, మంద నరేష్, విజయ్, రాజు, జోజి, రాయన్నతో పాటు తదితరులు ఉన్నారు.

పొక్లెయినర్, ఇసుక ట్రాక్టర్లు సీజ్



వర్ధన్నపేట : అక్రమంగా ఇసుక తవ్వి రవాణా చేస్తున్న పొక్లెయినర్‌తో పాటు ఆరు ట్రాక్టర్లను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని ల్యాబర్తి గ్రామ శివారు ఆకేరు వాగు వద్ద పొక్లెయినర్‌తో అక్రమంగా ఇసుక తవ్వుతూ ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారన్న సమాచారం మేరకు ఆదివారం సాయంత్రం ఆకస్మికంగా దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తవ్వి రవాణా చేస్తే వారిపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



నర్సంపేట : నర్సంపేటలోని 2వ వార్డుకు చెందిన బూర రాధిక, 11వ వార్డుకు చెందిన డొలాగర్ గోపినాథ్, 19వ వార్డుకు చెందిన గుజ్జుల వెంకటేష్ సోమవారం అనారోగ్యంతో మృతిచెందారు. కాగా కాంగ్రెస్ పార్టీ నాయకులు వారి మృతదేహాలపై పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రామానంద్, రవీందర్‌రావు, రాజేందర్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

Under the instructions of my client **M/s. Shriram Finance Limited, KAZIPET** Branch. Issue the following notice to general public. My client intends to grant loan to **ALUVALA RAJANNA, S/o: Aluvala Kanakaiah** R/o. H.No. 2-10-18, Waddepalle, Rural Warangal by keeping the below mentioned property as security by way of Registered Mortgage. As such if anyone have any Claims, Charges, Mortgages, Sale Agreements, Court Attachments, Court Disputes etc. shall be informed to the address mentioned below in writing within (7) days from the date of this notice. Otherwise, later objections will not bind my client in this regards.

SCHEDULE OF THE PROPERTY

Open Plots bearing No 42, 43 & 44 (Plot No.42 Extent: 132.88 Sq.Yds, Plot No.43 Extent: 334.55 Sq.Yds, Plot No.44 Extent: 184.22 Sq.Yds) Total Extent of 622.31 Sq.yds or 520.31 Sq.Mtrs, out of Sy.No.1568/1 of Madikonda Revenue(V), Kazipet Mandal (previously Hanamkonda mandal) within the limits of Greater Warangal Municipal Corporation, Revenue Dist Hanamkonda (previously Warangal Urban Dist) Registration Dist Warangal & it is in the jurisdiction of the Joint Sub-Registrar, Warangal (R.O) & bounded by: (Near to H.No.62-3-101/8/D) **East**: 40' Wide Road, **West**: Land in Sy.No.1568 of Mallaiah, **North**: 40' Wide Road & Land in Sy.No.1568 of Mallaiah, **South**: Land in Sy.No.1567 & 1568.

Sd/- **NALLELLA SURENDER**, B.A.B.L. Advocate, H.No.1-8-489, Haritha Residency, Balasamudram, Hanamkonda. Cell: 9849385117.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

వరంగల్ రూరల్ : 9951602875 9553955722

Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.

డి. రాజు యాదవ్ (S.R) : 9502950309
పి.చంద్రశేఖర్ (A.C.O) : 8074606274